క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 50, పచ్చిమిర్చి 60 , బెండ 40, కాకర 50, దొండ 40, దోస 60, ఆలు 25, చామ 50, కీర 30, బీర 40, వంకాయ 40, గోకర 50, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 200, వెల్లుల్లి 180.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైట్‌ఫీల్డ్ ఏరియా, సిగ్నేచర్ టవర్స్, మీనాక్షి అపార్ట్‌మెంట్స్, ఆదిత్య అపార్ట్‌మెంట్స్, జూబ్లీ గార్డెన్, అపర్ణ అపార్ట్‌మెంట్స్, భిక్షపతినగర్, రాఘవేంద్ర కాలనీ, ఏ,బీ,సీ బ్లాక్స్, రాజరాజేశ్వరినగర్ జాగృతి కాలనీ, కొత్తగూడ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్ : శ్రీలా గార్డెన్, రామ్‌నరేష్ నగర్, కేబుల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీలా గార్డెన్, ఎస్‌సీబీనగర్, నడిగడ్డతాండ, సత్యానారాయణ ఎన్‌క్లేవ్, అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాంనరేషనగర్, హైదర్ విలేజ్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మధురానగర్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిసరాలు, రాయదుర్గం సిగ్నల్ నుంచి బయోడైవర్సిటీ పార్కు, ప్రశాంతిహిల్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు.

- సాయిఐశ్వర్య కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయి ఐశ్వర్యకాలనీ, జైన్ హౌసింగ్, ఖాజాగూడ, హెచ్‌ఎండీఏ భవనాలు, గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు వివరించారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'సీక్రెట్ ఆఫ్ కర్మ ఫిలాసఫీ' అనే అంశంపై సివిల్ ఇంజనీర్, సీనియర్ రాజయోగి బి.కె. సూరజ్‌సింగ్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించవచ్చు.

హెచ్‌సీయూలో 21న జాతీయ సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తెలుగుశాఖ, మానవీయ శాస్త్రాల విభాగం, గురజాడ ఫౌండేషన్ అమెరికా సంయుక్త ఆధ్వర్యంలో గురజాడ జాతీయస్థాయి సదస్సును ఈనెల 21వ తేదీన నిర్వహిస్తామని తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్యులు కొవ్వలి గోపాలకృష్ణ, పమ్మి పవన్‌కుమార్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. మహాకవి గురజాడ అప్పారావు జీవితం, రచనలపై సదస్సును నిర్వహిస్తారు.

డాక్టర్ రమేష్‌కు సత్కారం



డా. రమేష్‌ను శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్ : సీపీఆర్ ద్వారా వ్యక్తి ప్రాణాన్ని కాపాడిన డాక్టర్ రమేష్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శాలువాతో సత్కరించి అభినందించారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో ఇటీవల తన స్నేహితుడిని కలిసేందుకు వచ్చిన ప్రతాప్ (29) ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో స్థానికులు హుటాహుటిన ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుడు రమేష్ వద్ద తీసుకువెళ్లగా వెంటనే సీపీఆర్ చేసి ప్రతాప్‌ను కాపాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ చౌదరి, తిరుపతి, రజినీకాంత్, రూపరెడ్డి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 09 మందికి కొవిడ్ ర్యాపిడ్ యాంటిజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు8 మందికి నిర్వహించినట్లు తెలిపారు.

మోడ్రన్ 'సీసీసీ'

- 'ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా' ఆధ్వర్యంలో భారీ నిర్మాణం
- రూ.26.15 కోట్ల వ్యయంతో నిర్మాణం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు
- 800 మంది కూర్చునే సెమినార్ హాల్
- 100/150 మందికి వేర్వేరుగా మరో రెండు సెమినార్ హాళ్లు
- ఇది గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో జీ ప్లస్ 2 నిర్మాణం



ఎస్కీలో నిర్మితమవుతున్న సెంటినరీ కన్వెన్షన్ సెంటర్ భవనం నమూనా

రాయదుర్గం: నగర శివారులో మరో అధునాతన కన్వెన్షన్ సెంటర్ అందుబాటులోకి రానుంది. విద్యా, ఉద్యోగ శిక్షణ, అవగాహనా కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు అవకాశం కలగనుంది. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 'సెంటినరీ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం పూర్తి కావొచ్చింది. కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వ సంస్థలలో పని చేసే ఉన్నతస్థాయి అధికారులు, ఇంజనీర్లు, సైంటిస్టులు, ఇతర ఉద్యోగులకు 'ఎస్కీ'లో ఏటా 350 కార్యక్రమాల ద్వారా 7వేల మందికి శిక్షణ ఇస్తున్నారు.గచ్చిబౌలిలో 70 ఎకరాల్లో 'ఎస్కీ' 1981 నుంచి కొనసాగుతోంది. ఇది అందుబాటులోకి వస్తే రెట్టింపు శిక్షణా కార్యక్రమాలను అమలు చేయాలని సంకల్పిస్తున్నారు.ఇప్పటికే శేరిలింగంపల్లి మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో భారీ కన్వెన్షన్ సెంటర్, జీఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్ ఉండగా అదే తరహాలో ఆధునిక స్థాయిలో కూడిన సౌకర్యాలతో మరో కన్వెన్షన్ సెంటర్‌గా ఏర్పాటు కానుంది.

కన్వెన్షన్ సెంటర్‌లో సౌకర్యాలు ఇవే..

- 'ఎస్కీ'లో రూ.26.15 కోట్ల వ్యయంతో 'సీసీసీ' నిర్మాణం
- ఒకేసారి 800 మందికి శిక్షణ కల్పించేలా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. అంతేకాకుండా ఒకేసారి 100,150 మందికి వేర్వేరుగా సెమినార్ హాళ్లను అందుబాటులోకి తెస్తున్నారు.
- అలాగే మరో 50 మందికి ఒకేసారి నాలుగుచోట్ల శిక్షణ, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేలా నాలుగు ప్రత్యేక హాళ్లను కూడా అందుబాటులోకి తెస్తున్నారు.
- ప్రస్తుతానికి 100 గదుల్లో 200 మంది శిక్షణ కోసం వచ్చే వారు వసతి పొందేలా ఏర్పాట్లు ఉండగా దీన్ని మరింత రెట్టింపు చేయాలనే ప్రతిపాదనలు చేశారు.

జనవరిలో అందుబాటులోకి..



ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ప్రాంగణంలో సెంటినరీ కన్వెన్షన్ సెంటర్‌ను జనవరి-24లో అందుబాటులోకి తెస్తాం. ఇప్పటికే పనులు చురుకుగా సాగుతున్నాయి. ఏటా 'ఎస్కీ'లో 350 కార్యక్రమాలతో 7వేల మందికి శిక్షణ ఇస్తున్నాం.వీటిని రెట్టింపు చేయాలనేదే సంకల్పం. జాతీయ, అంతర్జాతీయ సమావేశాలు కూడా నిర్వహిస్తాం. ఈ నేపథ్యంలో కన్వెన్షన్ సెంటర్ ఆవశ్యకత ఉంది. దీన్ని ఇతరులకు ముఖ్యంగా విద్యా సంబంధ, శిక్షణ, అవగాహనా కార్యక్రమాలకు మాత్రమే అవకాశం కల్పిస్తాం.

–డా.రామేశ్వరరావు, డైరెక్టర్, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా



ముగిసిన జీవవైవిధ్య సంరక్షణ సదస్సు

గచ్చిబౌలి: పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధనా సంస్థ(ఈపీటీఆర్ఐ)లో నిర్వహించిన రెండు రోజుల సదస్సు శుక్రవారం ముగిసింది. తెలంగాణ జీవవైవిధ్య మండలి ఆర్థిక సహకారంతో తెలంగాణ రాష్ట్ర డిగ్రీ కళాశాల అధ్యాపకులు 40 మందికి జీవ వైవిధ్య సంరక్షణ అనే అంశంపై రెండు రోజుల సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రపంచ జీవ వైవిధ్య ప్రణాళిక, కార్యాచరణ, ప్రజా జీవ వైవిధ్య రిజిష్టర్ తయారీ, ప్రయోజన భాగస్వామ్యం, మందు మొక్కల ఉద్యానవనం తయారీ, అటవీ సంపదను అంచనా వేయడం, అంతరించిపోతున్న వృక్షాలను వాటి కణజాల వర్ధనంలో తిరిగి పెంపొందించడానికి తీసుకునే చర్యలను ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణిప్రసాద్ వివరించారు. సీనియర్ ఐఏఎస్ అధికారులు కాశీచరణ్ కర్దడే, వాకాటి కరుణ ఆధ్వర్యంలో సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధికారులు డాక్టర్ సునీల, డాక్టర్ జ్యోతి, డాక్టర్ వీరాంజనేయులు, ప్రశాంతి, మహ్మద్‌ఖాదర్, పద్మజ, శిరీష, లక్ష్మీనారాయణ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి వాకాటి కరుణ, వాణిప్రసాద్ తదితరులు

అంతర్గత రహదారుల అభివృద్ధికి నిధులు



బీటీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గ్రామాల మధ్య ఇంటర్ లింక్‌రోడ్ల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం చౌరస్తా నుండి బచ్చుగూడెం, చిట్కుల్ మీదుగా ఇస్నాపూర్ జాతీయ రహదారి వరకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా నాలుగు కోట్ల అరవై ఒక్క లక్షల రూపాయలతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు రెన్యువల్ పనులను శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఇస్నాపూర్ చౌరస్తా నుండి వయా నందిగామ, క్యాసారం గ్రామం వరకు ఎస్ఆర్ఆర్‌డీఏ ద్వారా 6 కోట్ల 58 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రోడ్డును పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో గత తొమ్మిది సంవత్సరాల కాలంలో 20కి పైగా బ్రిడ్జిలు నిర్మించడంతోపాటు,. గ్రామాల మధ్య అంతర్గత రహదారులను నిర్మించడం జరిగిందని తెలిపారు. దీని మూలంగా మారుమూల గ్రామాల సైతం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లడంతో పాటు ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ, జెడ్పీటీసీ సుప్రజ ,పంచాయతీ రాజ్ శాఖ ఈఈ జగదీశ్వర్, ఎంపీడీఓ బన్సీలాల్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, నందిగామ సర్పంచ్ ఉమావతి గోపాల్, ఎంపీటీసీలు నాగజ్యోతి లక్ష్మణ్, మాధవి నరేందర్ రెడ్డి, చిట్కుల్ ఉపసర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, దశరథ్‌రెడ్డి, డీఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మనూలో 'మౌలానా ఆజాద్ ఏ లైఫ్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ ఐనుల్‌హసన్, రిజిస్ట్రార్ ఇష్తియాక్ అహ్మద్ తదితరులు

రాయదుర్గం: భారతదేశంలో విద్యాభివృద్ధికి మౌలానా ఆజాద్ ఎంతో కృషి చేశారని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలానా ఆజాద్ చైర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ సంయుక్త ఆధ్వర్యంలో మౌలానాఅబుల్ కలామ్ ఆజాద్‌పై రెండవ రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీలోని ఎన్‌యూఈపీఏ ప్రొఫెసర్ సయ్యద్ ఇర్ఫాన్ హబీబ్ రచించిన 'మౌలానా ఆజాద్ ఏ లైఫ్' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రొఫెసర్ అమీర్‌అలీ మాట్లాడుతూ భారతదేశంలోనే మౌలానా ఆజాద్ గొప్ప రాజనీతిజ్ఞుడుగా గుర్తింపు పొందారని గుర్తు చేశారు. మనం అధికారం గురించి ఎలా ఆలోచించాలో అందరికీ దిశానిర్దేశం చేశారన్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్ షాన్నారోడ్రిగ్స్, ప్రొఫెసర్ సయ్యద్ ఇంతియాజ్, ప్రొఫెసర్ మహ్మద్ సజ్జాద్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో గడపగడపకూ రవన్న ప్రజాయాత్ర



హఫీజ్‌పేట్ : బీజేపీ గడపగడపకు రవన్న ప్రజాయాత్ర శుక్రవారం 75వ రోజు 750 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని యూత్ కాలనీవాసులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్, ప్రకాషనగర్ కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ తాను చేపట్టిన ప్రజాయాత్రలో తన దృష్టికి వచ్చిన సమస్యలకు పరిష్కార మార్గం చూపుతామన్నారు. నాయకులు అనూష మహేష్ యాదవ్, శ్రీధర్‌గౌడ్, రవిగౌడ్, అశోక్, రవి ముదిరాజ్, లక్ష్మణ్, బాబు, శ్రీనివాస్, ప్రసాద్, రాధాకృష్ణ, ఎల్లేష్ పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల నాయకుడు పాపన్నగౌడ్

- గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొంతి లక్ష్మీనారాయణగౌడ్
- నేడు మియాపూర్ ఆల్విన్ క్రాస్ వద్ద కాంస్య విగ్రహావిష్కరణ

మియాపూర్: సబ్బండ వర్గాల నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు దొంతి లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. మియాపూర్‌లో ఆల్విన్ క్రాస్ రోడ్డు వద్ద శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మియాపూర్‌లోని ఆల్విన్ క్రాస్ రోడ్డు వద్ద శనివారం సర్వాయి పాపన్నగౌడ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, గీత కార్మిక కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్‌లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా గౌడ ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న జీవితం స్ఫూర్తిదాయకం

పటాన్‌చెరు: సర్దార్ సర్వాయి పాపన్న జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని, ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.శుక్రవారం పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని.. గీత కార్మిక సంఘం పటాన్‌చెరు మండల కమిటీ ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన పాపన్నగౌడ్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించడంతో పాటు ట్యాంక్‌బండ్‌పై వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతి ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, పృథ్వీరాజ్, వెంకటేష్,రాజు, ప్రమోద్ గౌడ్, శ్యామ్, గీత కార్మిక సంఘం మండల గౌరవ అధ్యక్షులు ధనరాజ్ గౌడ్, మండల అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, వెంకటేష్‌గౌడ్, రాజు గౌడ్, ప్రతాప్ కృష్ణ గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మియాపూర్ ఆల్విన్ క్రాస్ రోడ్డు వద్ద సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన గౌడ సంఘం సభ్యులు

కొనసాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని శ్రీ ఫిట్‌ప్రో బ్యాడ్మింటన్ హౌస్‌లో 9వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ -2023 అండర్-15 పోటీలు కొనసాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీల ఆధ్వర్యంలో రెయిన్‌బో స్కై ఈవెంట్స్ నిర్వహించిన ఈ పోటీలను టూరిజం డెవలప్‌మెంట్ రాష్ట్ర మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బండి రమేష్‌లు గురువారం ప్రారంభించారు. కాగా నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 450 మంది క్రీడాకారులు పాల్గొననున్నారని నిర్వాహకులు తెలిపారు.

నేడు 5కే రన్

శేరిలింగంపల్లి: ఓటుపై చైతన్యానికి అయిదు కిలోమీటర్ల రన్‌ను శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు శేరిలింగంపల్లి ఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటలకు రాయదుర్గంలోని మల్కంచెరువు వద్ద ప్రారంభమయ్యే ఈ రన్ గచ్చిబౌలి స్టేడియం వరకు సాగుతుందన్నారు.

స్థల పరిశీలన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ శుక్రవారం పరిశీలించారు. యూపీహెచ్‌సీలో సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న భవనానికి స్థలాన్ని పరిశీలించారు. ఈఈ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ శైలజ, సీహెచ్‌ఓ స్వామి, నాయకులు గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుండి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అతని భార్య సునీత , పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన మల్లేష్(45) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లిన మల్లేష్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య అతడికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో భర్త కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త అదృశ్యంపై భార్య సునీత శుక్రవారం ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



విద్యార్థులకు గ్లాసులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత సోమిరెడ్డి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): విద్యాభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లెపల్లి లలిత సోమిరెడ్డి అన్నారు.శుక్రవారం తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాగి జావ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు శ్రీపాల్ రెడ్డి 900 మంది విద్యార్థుల కోసం స్టీల్ గ్లాసులు, స్టవ్, సిలిండర్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ నేడు ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం రాగిజావను అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో చదవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లచ్చిరాం నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి, తెల్లాపూర్ మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, నాయకులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కనుకుంటలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ పుష్ప నగేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వర్షం పడితే రోడ్లపై పెద్ద ఎత్తున నీరు నిలిచేవని సమస్యను పరిష్కరించేందుకు సీసీ రోడ్డు వేయించామన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ లో 17 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా జడ్జి 12 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున, నలుగురికి రూ.4 వేలు జరిమాన, మరో వ్యక్తికి రూ.5 వేలు జరిమానా విధించారని తెలిపారు.

ఉరేసుకొని బైక్ మెకానిక్ ఆత్మహత్య



సురేష్ (ఫైల్)

హఫీజ్‌పేట్ : ఓ బైక్ మెకానిక్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పాలవెల్లి తెలిపిన ప్రకారం.. శేరిలింగంపల్లి నెహ్రూనగర్‌కు చెందిన ఎం.సురేష్‌కుమార్ (47) చందానగర్‌లో భవాని మోటార్స్‌లో బైక్ మెకానిక్ షాప్ నిర్వహిస్తున్నాడు. గత 16 సంవత్సరాల క్రితం రాజేశ్వరితో వివాహం జరిగింది. వీరిద్దరికి ఒక అబ్బాయి (15), అమ్మాయి (12)లు ఉన్నారు. గత కొన్ని నెలలుగా షాప్‌నకు వెళ్ళకుండా మద్యం సేవిస్తున్నాడు. ఆరోగ్యం బాగా లేకపోవడంతో సురేష్‌కు వైద్య పరీక్షలు చేయించగా కాలేయ వ్యాధి ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో మందులు వాడుతూ మానసికంగా కుంగిపోయాడు. తిరిగి మద్యం తాగుతున్నాడు. గురువారం సాయంత్రం 4 గంటలకు భార్య రాజేశ్వరి పిల్లలను స్కూల్ నుంచి తీసుకురాగా సురేష్ బెడ్‌రూంలో ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే ఇంటి పక్కన ఉన్నవారి సహాయంతో దించి దగ్గరలో ఉన్న శ్రేయ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని తెలిపారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

వరుస చోరీలు

- గుమ్మడిదల మండలంలో చోరీల పరంపర
- నామమాత్రపు చర్యలు చేపడుతున్న పోలీసులు
- నెల రోజుల్లో మూడు ఘటనలు

జిన్నారం(పటాన్‌చెరు): వరుసగా చోరీలు జరుగుతున్నా పోలీసులు నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారు. నెల రోజుల్లోనే మూడు వరుస చోరీలు జరిగాయని పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గుమ్మడిదల మండలంలోని ఆయా గ్రామాల్లో నెల రోజుల్లో మూడు చోరీలు జరిగాయి. పదిరోజుల క్రితం గుమ్మడిదల గ్రామంలోని ఎల్లమ్మ, మల్లమ్మ ఆలయల్లోని హుండీని గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని సొమ్మును దొంగిలించారు. రెండు రోజుల క్రితం రాంనగర్ కాలనీలో నివాసం ఉండే భద్రయ్య ఇంట్లో చోరీ జరిగింది . ఈ చోరీలో ఆరున్నర తులాల బంగాం, 30తులాల వెండి, టీవీ చోరీకి గురైందని బాధితులు చెబుతున్నారు. దీంతో పాటు ఓ ఆటోను కూడా గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని బాధితులు చెబుతున్నారు. దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంచుకుని చోరీలకు పాల్పడుతున్నారు.

పనిచేయని సీసీ కెమెరాలు..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయటం లేదు. ప్రధాన రోడ్లు, కాలనీల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయక నెలలు గడుస్తున్నా వాటిని బాగు చేయించేందుకు ఎవరూ ముందుకు రావటం లేదు. దీంతో దొంగలు రెచ్చిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి ఎక్కువగా వలసలు..

పారిశ్రామికవాడలు ఉండడంతో ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు వలస వస్తున్నారు. పారిశ్రామిక వాడల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించక ఏళ్లు గడుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల ప్రజలు ఎక్కువగా వలస వస్తున్నారు. వలస వచ్చిన వారికి ఉపాధి లభించకపోవటంతో ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

విచారణ చేపడుతున్నాం: ఎస్ఐ లక్ష్మారెడ్డి గుమ్మడిదల

చోరీల విషయం విచారణ చేపడుతున్నాం. పారిశ్రామిక వాడల్లో తనిఖీలు చేస్తున్నాం. అనుమానం ఉన్న వారిని విచారిస్తున్నాం. చోరీలకు పాల్పడ్డ వారిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. అనుమానం కలిగితే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలి.